# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ఫించన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ కు నాలుగు కొత్త కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.
- ❖ జీఎస్టీ పన్నుల తగ్గింపుతో రాష్ట్ర ఆరోగ్య రంగంలో సుమారు 1,000 కోట్ల రూపాయల వరకూ ఆదా కానుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- ❖ స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో రేపు రాష్ట్ర వ్యాప్తంగా ఖాదీ ప్రదర్శనలు నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలియజేశారు.
- ❖ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ఈరోజు రాత్రికి వాయుగుండంగా మారుతుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

===================

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయనగరం జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని గజపతినగరం నియోజకవర్గం దత్తి గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుని ఇంటికి వెళ్ళి ముఖ్యమంత్రి పింఛను అందించారు. అనంతరం దత్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ... ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతీ నెలా ఒకటవ తేదీన రాష్ట్రంలో ఫించన్ల పండుగ వస్తోందని.. దేశంలో ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ఏడాదికి 33 వేల కోట్ల రూపాయలను ఫించన్ల కోసం ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఇటీవల ప్రారంభించిన స్త్రీశక్తి పథకం విజయవంతమయ్యిందని కేవలం 45 రోజుల్లోనే మహిళలు 10 కోట్ల ప్రయాణాలు చేశారని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

ఇక నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రభుత్వానికి 8 వేల కోట్ల రూపాయల ఆదాయం తగ్గుతున్నప్పటికీ వినియోగదారులకు లబ్ది చేకూరుతుందన్నారు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు ఈ జీఎస్టీ తగ్గింపుతో డబ్బు ఆదా చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు.

==================

ఆంధ్రప్రదేశ్ కు నాలుగు కొత్త కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈరోజు న్యూ ఢిల్లీలో జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ దేశంలో 57 నూతన కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని గుంటూరు, చిత్తూరు, కుప్పం, పలాస ప్రాంతాల్లో నూతన కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఇక పలాసలో కొత్త కేంద్రీయ విద్యాలయం స్థాపనకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసి, నిధులు మంజూరు చేయడంపై పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

==================

జీఎస్టీ పన్నుల తగ్గింపుతో రాష్ట్ర ఆరోగ్య రంగంలో సుమారు 1,000 కోట్ల రూపాయల వరకూ ఆదా కానుందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రాణధార ఔషధాలపై తగ్గించిన పన్నుతో ప్రజలు నేరుగా కొనుగోలు చేసే మందులు, సర్జికల్స్ పై 716 కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జరిగే కొనుగోళ్లలో 250 కోట్ల రూపాయల వరకు వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన కొనుగోళ్ల ఆధారంగా ఇకపై సుమారు 1,000 కోట్ల రూపాయల వరకు ప్రజారోగ్యంపై భారం తగ్గుతుందని అంచనా వేస్తున్నామని ఈరోజు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత నెల 21వ తేదీ వరకు 5, 12 శాతం చొప్పున ఔషధాలపై జీఎస్టీ ఉండేదని 12 శాతం కేటగిరిలోనే 99 శాతం మందులు ఉండేవని తెలిపారు. 12 శాతం శ్లాబ్ ను 5 శాతంకి తగ్గించడంతో ప్రజారోగ్యానికి భారీ ఊరట లభించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

==================

స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో రేపు రాష్ట్ర వ్యాప్తంగా ఖాదీ ప్రదర్శనలు నిర్వహిస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలియజేశారు. సెప్టెంబర్ 25న ప్రారంభమైన ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ డిసెంబర్ 25 వరకూ కొనసాగుతుందని చెప్పారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... అమెరికా భారత్ పై ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో మన దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వదేశీ నినాదాన్ని తీసుకున్నారని చెప్పారు. స్వాతంత్ర్యం అనంతరం ఖాదీపై దృష్టి సారించకపోవడం వల్ల దేశం బలహీన పడిందన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రేపు ఖాదీ సంతలు నిర్వహిస్తున్నామని పీవీఎన్ మాధవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

==================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా జీ20 సదస్సుని భారత్ విజయవంతంగా నిర్వహించడంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 118 సెకన్లు)

==================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉదయం మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 6 గంటల్లో ఉత్తర వాయువ్య దిశగా కదిలి వాయుగుండంగా మారుతుందని, ఆ తదుపరి అక్టోబర్ 3వ తేదీన తీవ్ర వాయుగుండంగా మారి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాల మధ్య తీరాన్ని దాటుతుందని... వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రేపటికి సంబంధించిన వర్ష సూచనలను వాతావరణ అధికారి ఎస్. కరుణాసాగర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

===================

===================